ఇద్దరు 'గండ్ర'లతో ప్రజలకు గండం



చిట్యాల: మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డుల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. 7వ వార్డులోని టిటూ క్వార్టర్స్‌లో వార్డు అధ్యక్షుడు కంబాల రాజయ్య అధ్వర్యంలో బీజేపీ అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ప్రచారానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ మహిళా మోర్చా జనరల్ సెక్రెటరీ మాధురి, సురవరం గీతామాధురి, జనరల్ సెక్రెటరీ వైస్ ప్రెసిడెంట్ రోహిణి, మరో జనరల్ సెక్రెటరీ లక్ష్మీప్రసన్న, బూత్ అధ్యక్షుడు రాజు, రాజశేఖర్, కొమురయ్య, రవి, అర్జునబాబు, రవి, రమేష్ పాల్గొన్నారు.

చిట్యాల: నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర సత్యనారాయణరావులతో తీరని గండం ఏర్పడుతుందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని రామచంద్రపురం, చిట్యాలలో ఇంటింటి ప్రచారం చేసి, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు తీరని అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 30న జరుగనున్న ఎన్నికల్లో గెలిపిస్తే చిట్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేపిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ఇద్దరు గండ్రలలో ఒకరు సంపాదనే ధ్యేయంగా, మరోకరు పదవి ఆశతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమౌళి, మండల నాయకులు రాజ్‌కుమార్, మైదం శ్రీకాంత్, చెక్క నర్సయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగాలు కల్పిస్తాం



ధర్మారంలో కండువా ఊపుతూ యువతలో జోష్ నింపుతున్న ధర్మారెడ్డి



మామునూరు: నమూనా ఈవీఎంతో అవగాహన కల్పిస్తున్న దామోదర్

- ధర్మారంను రెవెన్యూ మండలం చేస్తాం
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: యువతకు రానున్న రోజుల్లో టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పరకాల బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల మండలంలోని వెల్లంపల్లి, నడికూడ మండలంలోని మల్లకోపేట, వెల్లంపల్లి, కంఠాత్మకూర్, దామెర మండలంలోని పులుకుర్తి గ్రామ యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికి చల్లా గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గీసుకొండ: తమ ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌ను ఎప్పుడో నిలిపివేసిందని చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు చెబుతున్న కల్లబొల్లి మాటలపై విలీన గ్రామాల రైతులు ఎలాంటి బెంగ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 16వ డివిజన్, ధర్మారం, 15వ డివిజన్ రెడ్డిపాలెం, గోపాల్‌రెడ్డినగర్, మొగిలిచర్లలో రోడ్‌షోలను నిర్వహించిన సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, గోలి రాజయ్యలు ధర్మారంను రెవెన్యూ మండలం చేయాలని కోరగా ఆయన తాను గెలుపొందిన వెంటనే చేస్తానని హామీ ఇచ్చారు. కార్పోరేటర్లు సుంకరి మనీషా, ఆకులపెల్లి మనోహర్, డీసీసీబీ డైరెక్టర్ రమేశ్, నాయకులు సుంకరి శివ, గోలి రాజయ్య, గోదాసి రాజ్‌కుమార్(చిన్న), మల్లేశం, రాజు, కొమ్ముల కిషోర్, రాజు, రాజయ్య, సాంబయ్య, సదానందం, శ్రీనివాస్‌రెడ్డి, ఉజ్వల్ పాల్గొన్నారు.

గీసుకొండలో చల్లా జ్యోతి ప్రచారం

గీసుకొండలో చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలోని మహిళలు ఆమెకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, సర్పంచ్ బాబు, యాకూబ్, రాజేందర్, మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

నడికూడ: మండలంలోని పలు గ్రామాల్లో చల్లా ధర్మారెడ్డి గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో యువత ఇంటి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ ఊర రవీందర్‌రావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అప్పం చేరాలు, సతీష్ రావు కిషన్, రవీందర్ రావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలి

దామెర: పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మండల రైతు బంధు కోఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కారుగుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. దామెరను నూతన మండలంగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన ఘనత చల్లా ధర్మారెడ్డిదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పోలం కృపాకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, నాయకులు దామెరుప్పుల శంకర్, మేరుగు సంతోష్, సోనబోయిన కిశోర్, బోడ శ్రీను, మేరుగు సంపత్, దామెర ఆనందం పాల్గొన్నారు. ఒగ్లాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కిన్నెర రమేష్, పులుకుర్తిలో మండల యూత్ వింగ్ అధ్యక్షులు మెంతుల రాజు, సర్పంచ్ గోవిందు అశోక్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

వసంతాపూర్‌లో..

మామునూరు: చల్లా ధర్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల ఇన్‌చార్జ్ కత్తిరపెల్లి దామోదర్ కోరారు. ఈమేరకు వసంతాపురం గ్రామంలో కార్పొరేటర్ గద్దె బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సోల్తి భూమాత, నరేందర్, బొజ్జ యాదగిరి, మాటేటి సురేష్, ఊరుగొండ అశోక్, కడిదల చంద్రమౌళి, రవి, గోపి, గుండెకారి జగదీశ్వర్, నవీన్, వెంకటేష్, బొజ్జ యువరాజ్, బరిగెల సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి రూరల్: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: ప్రతిపక్ష నాయకుల మాయ మాటాలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, వజినపల్లి గ్రామాలతో పాటు, రాత్రి మున్సిపల్ పరిధిలోని కాసీంపల్లి, కారల్ మార్క్స్ కాలనీ, టీటూ క్వార్టర్స్ లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు ఆలోచించి అభివృద్ధిపై చర్చించి నవంబర్ 30 జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నో పోరాటాల నడుమ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి చెందిందన్నారు. రైతులకు రైతు బంధు, రైతు బీమా, ఉచితంగా 24గంటల విద్యుత్, ఎరువులు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలక దీటుగా విద్య, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ఉచితంగా దుస్తులు పంపిణీ చేసిన ఏకైకా ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి కుమార్తె ప్రియాంకరెడ్డి, కోడలు వైశాలిరెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భూపాలపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత గండ్ర వెంకటరమణారెడ్డి దక్కుతుందన్నారు. మడికొండ రవీందర్ రావు, ఎంపీటీసీ కట్కూరి పద్మ, గుర్రపు తిరుపతిగౌడ్, రమణాచారి, బుర్ర శ్రీధర్,తౌటం నవీన్, కొత్తూరి రాజిరెడ్డి, పాండ్రాల స్వామి, చింతల రమేష్, కట్కూరి నరేందర్, చిదిరాల సరోజన, వీణవంక శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గండ్ర హయాంలోనే అభివృద్ధి

శాయంపేట: భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి హయంలోనే శాయంపేట మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి గెలుపు కోరుతూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గండ్ర వెంకటరమణా రెడ్డి గెలిపించారని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంబర్తి సంతోష మల్లేష్, ఉపసర్పంచ్ సతీష్, నాయకులు చెన్నా రమేష్, రాజు, శ్రీను, సునీల్, వినయ్, శరబంధం పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే



చిట్యాల: ప్రచారంలో ప్రియాంకరెడ్డి, వైశాలిరెడ్డి



శాయంపేట: ప్రచారం చేస్తున్న నాయకులు

దళితుల్లో వెలుగులు నింపిన మహనీయుడు కేసీఆర్

బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట/వీణవంక: హుజూరాబాద్ మండలంలోని ఇందిరానగర్‌లో ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఎమ్మెల్యేగా గెలిపించాలని, నియోజకవర్గంలో అభివృద్ధి చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగనని అన్నారు. దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్‌ను ఎంపిక చేసి నియోజకవర్గంలోని దళితుల అభివృద్ధికి రూ.10 లక్షల చొప్పున కేటాయించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన మహనీయుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 24 గంటల ఉచిత కరెంటుతో పాటు రుణమాఫీ చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కోసం ప్రవేశపట్టిన మేనిఫెస్టోతో సంక్షేమం పరుగులు పెడుతుందని, పదిహేనేళ్లుగా నియోజకవర్గ ప్రజల మధ్య ఉంటున్నాను, ఏ ఆపద వచ్చినా నేనున్నా అంటూ నా వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. నా కష్టాన్ని గుర్తించి ఓటేసి గెలిపించాలని కోరారు. మండలంలోని చెల్పూర్ గ్రామంలో కౌశిక్‌రెడ్డి సతీమణి షాలిని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలోని అంశాలు, ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేయనున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ జయసుధ వాసుదేవారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సదానందం, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రజిత, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

గడుప గడుపకు తిరుగుతూ ప్రచారం

జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి 20, పట్టణంలోని 21వ వార్డుల్లో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ఆయా వార్డుల కౌన్సిలర్లు గడుప గడుపకు తిరిగుతూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నమూనా బ్యాలెట్ చూపుతూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దేశిని రాధాసదానందం, వార్డు అధ్యక్షుడు గట్టు శ్రీనివాస్, నాయకులు దాస్యపు వెంకట నర్సయ్య, బుర్ర అబజ్, నరేడ్ల రాజేశం, విజ్జగిరి రాజు, రాం మహేశ్, శేఖర్, రమణ, రాజు, సమ్మయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొనానరు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు అన్నారు. వీణవంక మండలం చల్లూర్‌లో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేప్పేవి అబద్ధాలేనని, 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పొదిల్ల రమేశ్, తాండ్ర శంకర్, బొంగోని రాజయ్య గౌడ్, జక్కు నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ముదిగంటి శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చెల్పూర్‌లో ప్రచారం చేస్తున్న పాడి షాలిని

ఆరు గ్యారంటీలు పక్కాగా అమలుచేస్తాం

- హుజూరాబాద్ అభ్యర్థి వొడితెల ప్రణవ్

హుజూరాబాద్/జమ్మికుంట: కాంగ్రెస్ గెలిచాక ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని హుజూరాబాద్ అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని సీఎస్ఐతో పాటు వివిధ చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ప్రణవ్‌ను శాలువాలతో సత్కరించారు. పట్టణంలోని సూపర్ బజార్, డీసీఎంఎస్ కాంప్లెక్స్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, పక్కా రాష్ట్రంలో పార్టీ హామీలను పక్కాగా అమలు చేస్తుందని, కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ చేసి పింఛన్లు పెంచేస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి మాట తప్పనిది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు, ఎన్ఎస్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్, దయానంద్, ఉమేశ్, తదితరుల ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జమ్మికుంట పట్టణానికి చెందిన మైనారిటీ నాయకుడు మహమ్మద్ రంజాన్, మండలంలోని మడిపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండి కుమారస్వామి, బీజేపీ సీనియర్ నాయకులు అప్పాల రవి, నాగపురి శ్రీనివాస్‌తోపాటు వంది మంది కాంగ్రెస్‌లో చేరారు. ప్రణవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రణవ్ గెలుపు కోసం కృషి చేస్తామని, అధికార పార్టీకి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట మాజీ సర్పంచ్ పానగంటి మల్లయ్య, బీసీ మండల నాయకులు సదానందం, ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో వొడితెల ప్రణవ్

ఈటల రాజేందర్‌కు గీత కార్మికుల మద్దతు

కమలాపూర్: బీజేపీ హుజూరాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్‌కు గౌడ కులస్తులు మద్దతు తెలుపుతున్నట్లు గౌడ సంఘం జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గౌని సాంబయ్య తెలిపారు. కమలాపూర్‌లోని ఈటల రాజేందర్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 500 మంది వరకు గీత కార్మికులు కులవృత్తి చేస్తూ ప్రమాదాల భారిన పడి మరణిస్తున్నారని, ఐనప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం సేఫ్టీ మోకులాంటి పరికరాలు అందించడంలేదన్నారు. రానున్న రోజుల్లో బీసీ బిడ్డగా ఈటల రాజేందర్ సీఎంగా తెలంగాణ రాష్ట్రంలోని గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తారని, హుజూరాబాద్ నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని గీత కార్మికులు తమ మద్దతును ఈటల రాజేందర్‌కు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో గౌడ సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు మార్క అశోక్, కార్యదర్శి పబ్బు సుభాష్, ఉపాధ్యక్షులు పులి సాంబయ్య, పంజాల శంకరయ్యగౌడ్, హనుమకొండ జిల్లా గౌరవ సలహాదారు మోడెం రాజేందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొనగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా..

ఐనవోలు: స్థానికుడిగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి కొండేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో శ్రీధర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అరూరి రమేష్ పేదల భూములు గుంజుకుంటూ వేలాది ఎకరాలు అక్రమ ఆస్తులు సంపాదించాడని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి చేయడంలో విఫలమైన ఎమ్మెల్యే గ్రామాల్లో తిరగడానికి భయపడుతున్నారన్నారు. అభ్యర్థి ఇన్‌చార్జ్ మల్లాది తిరుపతిరెడ్డి, అడ్డగట్ల రాజేంద్ర ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన పాపాలకు ఉరివేసినా తక్కువే..

- పరకాల మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల/దామెర/ఆత్మకూరు: కేసీఆర్ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. ఎంతో మంది నిరుద్యోగుల చావుకు కారణమై కేసీఆర్ చేసిన పాపాలకు ఉరివేసిన తక్కువే.. అని ఆయన అన్నారు. బీజేపీ పరకాల నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణ, హిందు రక్షణ కోసం బీజేపీ సమర్ధవంతమైన నాయకత్వంతో ముందుకు వెలుతుందన్నారు. మాజీ కౌన్సిలర్ బండి రమాదేవి-రవి దంపతులు మొలుగూరి భిక్షపతి సమక్షంలో బీజేపీలో చేరారు. సాంబయ్య, ఆర్పీ జయంత్ లాల్, ఎర్ర రామన్న, మార్త భిక్షపతి, వెంకటస్వామి, మేకల రాజవీరయ్య, సిరంగి సతీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

దామెర మండలంలోని కోగిల్వాయిలో వివిధ పార్టీల నాయకులు, ముదిరాజ్ కులసంఘం సభ్యులు ఆదివారం బీజేపీలో చేరారు. ప్రధాని మోదీని ఎస్సీలు విశ్వసించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో గోవిందు అభిలాష్, మంద రవి, కోగిల లక్ష్మణ్, సత్యనారాయణ, బుచ్చిరెడ్డి, రమరాజు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మండలకేంద్రానికి చెందిన గౌడ సంఘం నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

దామెర: ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పరకాల రూరల్ సీఐ మల్లేష్ సూచించారు. మండలంలోని వెంకటాపూర్, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, దమ్మన్నపేట, ఒగ్లాపూర్ గ్రామాల్లో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎస్సై రాజేందర్, ఏఎస్సై రాజు, సిద్దయ్య, పాల్గొన్నారు.

వంగర పీఎస్ పరిధిలో పోలీస్ కవాతు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం వంగర్ పీఎస్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగర పీఎస్ పరిధిలోని ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నడికూడ: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పరకాల సీఐ వెంకటరత్నం అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

నేడు కార్తీక పౌర్ణమి వేడుకలు

పరకాల: కార్తీక పౌర్ణమి సందర్భంగా పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం విద్యుత్ దీపాలతో ఆకట్టుకుంటుంది. నేడు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సుమారు 5వేల మంది భక్తులకు ఉదయం 8గంటల నుంచే మహా అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

దామెర: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పోలం కృపాకర్ రెడ్డి, మండల దళిత బంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, ఎంపీటీసీ గండు రాము, ఎంపీఓ రంగాచారి, దాడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గోవిందు రవికుమార్ పాల్గొన్నారు.

గుడిసెవాసుల పట్టాలకు ఉద్యమిస్తా..

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ రెవెన్యూ శివారులోని 633 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో పేదల గుడిసెలకు పట్టాలిచ్చే వరకు ఉద్యమిస్తామని తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి వంగరి సాంబయ్య అన్నారు. ఆదివారం ఆయన గుడిసెవాసులతో మాట్లాడారు.

బీఆర్ఎస్‌కు ఓటమి ఖాయం

వేలేరు: ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఓటమి ఖాయమని మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం వేలేరు మండలంలోని పీచర గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు ఇటీవల ప్రచారం నిర్వహిస్తున్న సందర్భంలో గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను మేము కట్టించామని గొప్పలు చెప్పుకున్నారని, అది పూర్తిగా అవాస్తవమని పాఠశాలను మాజీ మావోయిస్టు పోలు లింగన్న చందాలు వసూలు చేసి కట్టించాడని తెలిపారు. అమాయక ప్రజలను ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపింది ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కూరపాటి రమేష్,పోలు తిరుపతి, ఎల్లయ్య,కొలిపాక వెంకటేశ్,కొయ్యడ రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ఎన్నిక

కమలాపూర్: ఉపసర్పంచుల ఫోరం కమలాపూర్ మండల అధ్యక్షుడిగా కమలాపూర్ ఉపసర్పంచ్ మౌటం రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని ఉపసర్పంచులు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మేకల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మిల్కూరి ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శిగా సోగల రాజు, సహాయ కార్యదర్శిగా రమరమేష్, కోశాధికారిగా పిడిశెట్టి కవితకుమారస్వామి, గౌరవ అధ్యక్షుడిగా దబ్బెట అశోక్, సాంబయ్య ఎన్నికయ్యారు.

విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్

శాయంపేట : రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఉచిత హామీలు ఇచ్చి సీఎం కేసీఆర్ మోసం చేశారని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత పది సంవత్సరాల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులను పట్టించుకోకుండా మోసం చేశారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం పోటీ పరీక్షల పేపర్లను లీక్ చేస్తూ.. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందని మండిపడ్డారు. ఈసారి విద్యార్థులు, నిరుద్యోగులు సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బొచ్చు కల్యాణ్, మడికొండ ప్రశాంత్, ఎండి ఇస్మాయిల్, మంద కార్తీక్, వికాస్, రమేష్, నవీన్, శశాంక్, సందీప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు

ఐనవోలు: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ విరుచుకుపడ్డారు. ఆదివారం మండలంలోని నందనంలో కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వంత ఇల్లు కట్టుకోవాలని ఆశతో ఎదురుచూసిన నిరుపేదల కల నెరవేరలేదన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే అరూరి రమేష్ మాత్రం మండలానికో ఇల్లు కట్టుకుని బాగుపడ్డాడని ఆరోపించారు. బండి సుధాకర్, సమ్మెట మహేందర్, జెట్టబోయిన లక్ష్మి, రాజు, మండల సత్యం తదితరులు పాల్గొన్నారు.